లైంగిక వేధింపులతో యువతి ఆత్మహత్య

• ముగ్గురిపై కేసు నమోదు

మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

ధరూరు, అక్టోబర్ 28: లైంగిక వేధింపులు భరించలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. దీనికి సహకరించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివానందన్‌గౌడ్ తెలిపారు. ఆ వివరాలు.. మండలంలోని దోర్నాలకు చెందిన అరుణ తండ్రి నారాయణ(19) అనే యువతిని అదే గ్రామానికి చెందిన రాజు తండ్రి సాయన్న అనే యువకుడు లైంగికంగా వేధించేవాడు. దీనికి రాజు తండ్రి సాయన్నతో పాటు సమీప బంధువు ఆంజనేయులు తండ్రి కర్రెన్న సహకరించేవారు. దీంతో వేధింపులు తాళలేక యువతి ఈనెల 27న ధరూరు నుంచి దోర్నాలకు వెళ్లే దారిలో నెట్టెంపాడు ప్రధాన కాల్వ బిడ్జి నుంచి కాల్వలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అదేరోజు నుంచి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా, 28న శనివారం మృతదేహం బయటపడింది. మృతురాలి అన్న ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అయితే సంఘటన స్థలాన్ని గద్వాల సీఐ శ్రీనివాసులు పరిశీలించి మృతురాలికి సంబందించిన అనవాళ్లను పరిశీలించి, కుటుంబ సభ్యులతో మాట్లాడి నిందితులను కచ్చితంగా పట్టుకుని కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కేటీదొడ్డి ఎస్సై వెంకటేశ్, కానిస్టేబుల్స్ గోపి, గుప్తా, సిబ్బంది ఉన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన ఇద్దరు మహిళలు మృతి

జడ్చర్ల టౌన్, అక్టోబర్ 28: జడ్చర్ల మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో పద్మమ్మ(56) అనే మహిళ ఈనెల 27న రాత్రి ఇంట్లోనే ఎలుకల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబసభ్యులు గుర్తించి ఆమెను చికిత్స నిమిత్తం జడ్చర్ల సర్కారు దవాఖానాకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆమె మృతిచెందినట్లు మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. తరచుగా గుండెనొప్పి వస్తుండటాన్ని తట్టుకోలేక ఎలుకల మందు తాగి పద్మమ్మ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై చెప్పారు. అదే విధంగా జడ్చర్ల మున్సిపాలిటి పరిధిలోని పాతబజార్‌కు చెందిన మాధవి(44) అనే మహిళ ఈనెల 24న ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకోవటంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబసభ్యులు గుర్తించి ఆమెను హైద్రాబాద్‌లోని ఉస్మానియా దవాఖానాకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు మృతురాలి కుమారుడు రవీంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శ

పాతబజార్‌లో నివాసముంటున్న మాధవి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి శనివారం రాత్రి మృతురాలి కుటుంబాన్ని కలసి పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి తమ వంతు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

జడ్చర్ల టౌన్, అక్టోబర్28: పట్టణంలోని విజయనగర్‌కాలనీలో నివాసముంటున్న పూజిత(20) అనే మహిళ అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. స్థానిక విజయనగర్‌కాలనీలో నివాసముంటున్న పూజిత అనే మహిళ ఈనెల 26న గుడికి వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె కోసం కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె కుటుంబసభ్యులు శనివారం జడ్చర్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత

జడ్చర్ల టౌన్, అక్టోబర్28: పట్టణంలోని సరస్వతీనగర్‌కాలనీలోని ఓ కిరాణ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు జడ్చర్ల పోలీసులు తెలిపారు. కిరాణ దుకాణంలో అక్రమంగా మద్యం ఉన్నట్లు సమాచారం అందడంతో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కిరాణ దుకాణంలో రూ.6వేలు విలువ గల మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. యాజమాని వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులదే కీలకపాత్ర

• సివిల్ కోర్టు జడ్జి కవిత

• కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకుఅవ గాహన

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి కవిత

అలంపూర్, అక్టోబర్ 28 : బాల్య వివాహాల నిర్మూలనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కవిత అన్నారు. శనివారం అలంపూర్ మండలంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాలికలు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను తమ తల్లిదండ్రులకు వివరించాలన్నారు. సెల్‌ఫోన్‌ను ఎంత తక్కువ ఉపయోగించుకుంటే అంత మేలు జరుగుతుందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. బాలికల సంరక్షణ కోసం షీ టీం ఉందని, అత్యవసర సమయాల్లో (టోల్ ఫ్రీ నెంబర్లు 100, 1098) వాటి సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రమేశ్, లోక్ అదాలత్ ఇన్‌చార్జి సాయితేజ, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆంజనేయులు, న్యాయవాదులు, పోలీస్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో పటాలంలో స్మారక ర్యాలీ

పోలీసు సిబ్బందితో బైక్‌ర్యాలీలో పాల్గొన్న కమాండెంట్ సాంబయ్య

సాయుధ చైతన్య పాఠశాలలో నినాదాలు చేస్తున్న పోలీసు సిబ్బంది, పాఠశాల విద్యార్థులు

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 28: ఎర్రవల్లి మండల కేంద్రంలోని పదోపటాలంలో శనివారం పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా కమాండెంట్ సాంబయ్య ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. సాయుధ చైతన్య పాఠశాల నుంచి ప్రారంభమై అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నినాదాలతో ఎర్రవల్లి మీదుగా షేక్‌పల్లి, కొండేరు వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కమాండెంట్ సాంబయ్య ఆధ్వర్యంలో పటాలము సిబ్బంది గద్వాల్‌కు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగభూషణం, ఆర్.ఐలు రాజారావు, వెంకటేశ్వర్లు, రాజు, సుధీర్, సయ్యద్ బాషా, అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురై గిరిజన రైతు మృతి

గోపాల్‌నాయక్ మృతదేహంతో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

నవాబ్‌పేట, అక్టోబర్28: మండలంలోని బట్టోనిపల్లితండాకు చెందిన విస్లావత్ గోపాల్‌నాయక్(50) అనే గిరిజన రైతు విద్యుత్‌ఘాతానికి గురై మృతి చెందాడు. కాగా రైతు గోపాల్‌నాయక్ మృతికి ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యమే కారణమని తండాకు చెందిన రైతులు, కుటుంబ సభ్యులు గోపాల్‌నాయక్ మృతదేహంతో కొల్లూరు సబ్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. రైతు గోపాల్‌నాయక్ వ్యవసాయ పనుల నిమిత్తం తన పొలానికి వెళ్తుండగా..ఒక్కసారిగా ఎల్‌టీ లైను తెగి కింద పడటంతో రైతు గోపాల్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో విద్యుత్ లైన్లు అస్తవ్యస్థంగా ఉన్నాయని..ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు వెల్లడించినా పట్టించుకోలేదని, వారి నిర్లక్ష్యం కారణంగానే విద్యుత్ ప్రమాదం జరిగిదని రైతులు ధర్నా నిర్వహించారు. అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని సంబంధిత శాఖ ఏడీ తౌర్యానాయక్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడు గోపాల్‌నాయక్‌కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

మహ్మదాబాద్, అక్టోబర్ 28 : గుప్త నిధుల కో సం గుర్తు తెలియని దుండగులు వ్యవసాయ పొ లంలో తవ్వకాలు జరిపారు. స్థానికుల కథనం మేరకు మండలంలోని ముందలితండా గ్రామ పంచాయతీ అనుబంద గ్రామమైన లింగాయిపల్లి, తండా మధ్యలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో శుక్రవారం రాత్రి శుద్ర పూజ లు నిర్వహించి తవ్వకాలు చేపట్టారు. వేరు శనగ పంటకు నీళ్లు పెట్టడానికి వెళ్లిన స్థానిక రైతులు అ క్కడ జరుగుతున్న పూజలు మనుషుల కదలికల ను గమినించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకోగా నలుగురు అక్కడి నుంచి పారిపోగా మరో నలుగురు పోలీసులకు చిక్కారు. రెండు బై కులు స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకొన్నారు.

కొడుకు చేతిలో తల్లి హతం

కల్వకుర్తి రూరల్, అక్టోబర్28: కొడుకు చేతిలో తల్లి హత్యకు గురైన దారుణమైన సంఘటన కల్వకుర్తి పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. కల్వకుర్తి ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం... కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో కె. బంగారమ్మ(45) ఆమె కుమారుడు రమేశ్‌లు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. బంగారమ్మ కుమారుడు రమేశ్ గత కొంత కాలంగా మద్యానికి బానిసై మతిస్థిమితం లేకుండా తరచూ ఇంట్లో ఇద్దరు గొడవ పడుతుండే వాడు. ఈక్రమంలో శనివారం ఉదయం ఇంట్లో తన తల్లితో గొడవపడి ఆమె గొంతు మొలతాడు సాయంతో నులమడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీఐ ఆంజనేయులు, ఎస్సై రమేశ్‌లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ఆమె మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. బంగారమ్మ కుటుంబసభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై రమేశ్ వెల్లడించారు.

పీయూలో కబడ్డీ జట్ల ఎంపిక

పాలమూరు, అక్టోబర్ 28 : పాలమూరు విశ్వవిద్యాలయంలోని క్రీడా మైదానంలో శనివారం వివిధ కాలేజీల నుంచి వచ్చిన స్త్రీ, పురుషులకు కబడ్డీ జట్ల ఎంపికను నిర్వహించారు. ఈ ఎంపికల కార్యక్రమానికి ఉపకులపతి ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు సూచనలు చేశారు. ఎంపికల్లో ఎలాంటి పైరవీలు జరగకుండా ఉత్తమ జట్లను ఎంపిక చేయాలన్నారు. ఈ ఎంపికల్లో వంద మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి వారం రోజులపాటు ప్రత్యేక క్యాంపులో తర్ఫీదు ఇచ్చి జేఎన్‌టీయూ కాకినాడలో సౌత్ జోన్‌లో పాల్గొననున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కురుమూర్తి గౌడ్, బాలరాజయ్య, మేరిపుష్ప, శ్రీనివాసులు, శ్వేత, కవిత, రాజవర్ధన్, అధ్యాపకులు రవికుమార్, రంగప్ప, సురేశ్, జ్ఞానేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతజట్టుకు బహుమతి ప్రదానం

ఊర్కొండ : మండల కేంద్రంలో నాలుగు రోజులుగా (ఎంజేఆర్) ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిశాయి. బొమ్మరాజుపల్లి, ఊర్కొండ జట్లు తలపడగా, బొమ్మరాజుపల్లి ఫైనల్‌లో విజయం సాధించింది. ప్రథమ బహుమతి 15,116, ద్వితీయ బహుమతి ఊర్కొండ జట్టుకు కరాటే, కబడ్డీ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజయ్య, రవీందర్, శేఖర్, సందీప్, విజయ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.